సాక్షి
శ్రీకాకుళం
బుధవారం । 15 । మే । 2024



వేసవి సెలవులకు వచ్చి..

పారాపురం రిజర్వాయర్‌లో మునిగి ఓ బాలుడు మృతి చెందాడు. బాలుడిది బూర్జ గ్రామం.

- 8లో



ఏపీఆర్‌జేసీలో..

ఏపీఆర్‌జేసీలో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. ఏపీఆర్‌డీసీలోనూ చక్కటి ఫలితాలు తెచ్చారు.

- 8లో

15 నుంచి పాతపట్నంలో క్రీడాకారులకు వేసవి శిక్షణ శిబిరం

పాతపట్నం: పాతపట్నం మండల కేంద్రంలోని మినీ స్టేడియంలో శ్రీకాకుళం స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి జూన్ 15వ తేదీ వరకు క్రీడాకారులకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు పీడీ శేఖర్‌బాబు మంగళవారం తెలిపారు. క్రికెట్, అథ్లెటిక్స్ క్రీడలకు శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నామని, క్రికెట్ శిక్షణ కోసం పీడీ లోకేష్‌ను, అథ్లెటిక్స్ శిక్షణ కోసం పీడీ సురేష్ 81794 90751ను సంప్రదించాలని పీడీ శేఖర్ తెలిపారు.

న్యూస్‌రీల్

18 నుంచి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



డాక్టర్ గొలివి మోహన్ దంపతులకు ఆహ్వాన పత్రిక ఇస్తున్న కమిటీ ప్రతినిధులు

నరసన్నపేట: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని ప్రతిష్ఠించి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నెల 18 నుంచి 27 వరకూ బ్రహ్మోత్సవాలు ఆలయం ప్రాంగణంలో నిర్వహిస్తున్నారు. ఈ మేరకు విస్తృతంగా ఏర్పాట్లు చేస్తుండగా మరో వైపు ఆలయ కమిటీ ప్రతినిధులు ఆహ్వాన పత్రికలు చురుగ్గా పంపిణీ చేస్తున్నారు. ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. 18 నుంచి 27 వరకూ రోజూ పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. చామర్తి శ్రీనివాసాచార్యులు కృష్ణమాచార్యులు, ఆలయ ట్రస్టు కమిటీ చైర్మన్ పి.వీరభద్రస్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగనుంది.

ఓటెత్తిన గిరిజన గ్రామం

హిరమండలం: మండలంలోని గొడియపాడు గిరిజన గ్రామంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 316 పోలింగ్ బూత్ పరిధిలో అక్కడి ఓటర్లు 91.07శాతం ఓట్లేశారు. ఈ గ్రామంలో మొత్తం 224 మంది ఓటర్లు ఉండగా వీరిలో పురుషులు 91మంది ఓటు వేయగా స్త్రీలు 113 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే లోకొండ గిరిజన గ్రామం 315 పోలింగ్ బూత్‌లో 90.67శాతం పోలింగ్ నమోదు జరిగింది. గ్రామంలో మొత్తం 193 మంది ఓటర్లు ఉండగా వీరిలో పురుషులు 80మంది, స్త్రీలు 95మంది ఓటుహక్కు వినియోగించుకుని మండలంలో ద్వితీయ స్థానంలో నిలిచారు. అత్యల్పంగా మేజర్ పంచాయతీ హిరమండలం 298బూత్‌లో 56.47 శాతం పోలింగ్ నమోదైంది. ఇక్కడ 870మంది ఓటర్లు ఉండగా వీరిలో పురుషులు 244మంది, స్త్రీలు 236 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

మార్కెట్‌లోకి ఉద్దానం మునగ



కాశీబుగ్గ మార్కెట్‌లో అమ్మకానికి ఉంచిన మునగకాయలు

కాశీబుగ్గ: ఉద్దానంలో పండుతున్న దేశీ మునగ మార్కెట్‌లోకి వచ్చేసింది. ప్రస్తుతం హైబ్రీడ్ మునగకాయలు విరివిగా దొరుకుతున్నప్పటికీ దేశీ మునగకు మార్కెట్‌లో విపరీతమైన డిమాండ్ ఉంది. దీంతో ఉద్దానం దేశీ మునగను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. పలాస, మందస మండలం సముద్ర తీరంలో వ్యాపించి ఉన్న ఉద్దాన దేశీ పంట మార్కెట్‌కు తీసుకువస్తున్నారు. పలాస, కాశీబుగ్గ,పూండి, మందస,హరిపురం, బ్రాహ్మణతర్లా మార్కెట్‌లో అమ్మకాలు సాగుతున్నాయి. కట్ట రూ.30 మొదలుకొని లభించడంతో కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు.

అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు



శాంతామణి అమ్మవారు

నరసన్నపేట: వైశాఖ మాసం మొదటి మంగళవారం సందర్భంగా మండల కేంద్రం నరసన్నపేటలో అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక పైడితల్లి, శాంతామణి, నూకాలమ్మ తల్లి అసిరమ్మతల్లి ఆలయాల్లో అమ్మవారికి మహిళలు ముర్రాటు సమర్పించి మామిడి పండ్లతో మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాల వద్ద రద్దీ నెలకొంది. ఉదయం నుంచి 10 గంటల వరకు ఈ రద్దీ కొనసాగింది.

మహిళలే నిర్ణేతలు



- పోలైన ఓట్లలో వారిదే ఆధిక్యం
- వారితోనే వైఎస్సార్‌సీపీకి సానుకూలత
- గతం కంటే పెరిగిన ఓటింగ్
- 76.81 శాతం ఓటింగ్ నమోదు
- భారీగా ఓటు హక్కు వినియోగించుకున్న మహిళలు
- పురుషుల కంటే దాదాపు 2.83 శాతం అధికం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం

సార్వత్రిక ఎన్నికలు దిగ్విజయంగా ముగిశాయి. ఈవీఎంల్లో ఓటర్ల తీర్పు నిక్షిప్తమై ఉంది. అభ్యర్థుల భవితవ్యం వాటిలో భద్రమై ఉంది. స్ట్రాంగ్ రూముల్లో ఈవీఎంలున్నాయి. ఇక ఫలితాలే మిగిలాయి. కౌంటింగ్‌కు మరో 20 రోజుల సమయం ఉంది. దీంతో అభ్యర్థులంతా సోమవారం జరిగిన పోలింగ్ సరళిపై బూత్‌ల వారీగా సమీక్ష ప్రారంభించారు. కూడికలు, తీసివేతల్లో నిమగ్నమయ్యారు. జిల్లాలో ప్రధాన వైఎస్సార్‌సీపీ, టీడీపీ మధ్య పోటీ ఉంది. ఒకచోట వైఎస్సార్‌సీపీ, బీజేపీ మధ్య పోటీ నెలకొంది. ఓటర్లు తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చారని వైఎస్సార్‌సీపీ, ఓటర్లు తమవైపు ఉన్నారని టీడీపీ నేతలు పేర్కొంటున్నారు.



స్వల్పంగా పెరిగిన ఓటింగ్

జిల్లాలో 2019 ఎన్నికల కంటే పోలింగ్ శాతం స్వల్పంగా పెరిగింది. ఆ ఎన్నికల్లో 76.35 శాతం పోలింగ్ జరగ్గా ఈ సారి 76.81శాతం ఓటింగ్ నమోదైంది. 0.46శాతం పెరిగింది. జిల్లాలో 18,75,934 మంది ఓటర్లు ఉండగా వారిలో 14,40,885 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం ఓటర్లలో మహిళలు 9,45,945 మంది ఉండగా 7,39,852మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషుల ఓట్లు 9,29,859 మంది ఉండగా 7,01,016 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషుల కంటే అదనంగా దాదాపు 40వేల మంది మహిళలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. థర్డ్ జెండర్ ఓట్ల విషయానికి వస్తే 130 ఓట్లు ఉండగా కేవలం 17ఓట్లు (13.08 శాతం) మాత్రమే పోలయ్యాయి. జిల్లాలో అత్యధికంగా ఎచ్చెర్లలో 83.28శాతం, నరసన్నపేటలో 82.44 శాతం, ఆమదాలవలసలో 81.42 శాతం నమోదవ్వగా, నరసన్నపేటలో అత్యల్పంగా శ్రీకాకుళంలో 70.22 శాతం, ఇచ్ఛాపురంలో 70.56 పోలింగ్ శాతం నమోదైంది.

కూడికలు, తీసివేతల్లో నిమగ్నం

గత రెండు నెలలుగా మండు వేసవిలో ఎన్నికల కోసం విరామం లేకుండా పనిచేసిన నాయకులంతా ప్రస్తుతం సేద తీరుతున్నారు. హమ్మయ్యా ఎన్నికలు ముగిశాయని ఊపిరి పీల్చుకుంటున్నారు. నాయకులంతా తమ తమ అభ్యర్థుల వద్దకు వచ్చి పోలింగ్ ఎలా జరిగిందో చెబుతున్నారు. బూత్‌ల వారీగా ఎవరికెన్ని ఓట్లు వచ్చాయో లెక్కలు వేసుకుంటున్నారు. ఎక్కడ ప్లస్, ఎక్కడ మైనస్ అయిందో తెలుసుకుంటున్నారు. తమ వేగుల ద్వారా బూత్‌ల వారీగా సర్వేలు కూడా చేయించుకుంటున్నారు. ఎన్ని వస్తాయో అంచనా వేసుకునే పనిలో పడ్డారు. ఒకవైపు తమ కుటుంబ సభ్యులతో గడుపుతూనే మరోవైపు పోలింగ్‌పై లెక్కలు కట్టుకుంటున్నారు.

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
ఆమదాలవలస	1,93,858	1,57,848	81.42
ఎచ్చెర్ల	2,44,760	2,03,831	83.28
ఇచ్ఛాపురం	2,68,202	1,89,238	70.56
నరసన్నపేట	2,14,866	1,77,145	82.44
పలాస	2,19,348	1,67,632	76.42
పాతపట్నం	2,25,313	1,63,044	72.36
శ్రీకాకుళం	2,73,260	1,91,875	70.21
టెక్కలి	2,36,327	1,90,272	80.51
మొత్తం	18,75,934	14,40,885	76.81

మొత్తం పురుష ఓటర్లు	ఓటేసిన వారు	శాతం
9,29,859	7,01,016	75.38

మొత్తం మహిళా ఓటర్లు	ఓటేసిన వారు	శాతం
9,45,945	7,39,852	78.21

థర్డ్ జెండర్ ఓట్లు	పోలైన ఓట్లు	శాతం
130	17	13.08

నియోజకవర్గం	పోలైన ఓట్లు	పురుషులు	మహిళలు
ఇచ్ఛాపురం	1,89,238	85,632	1,03,604
పలాస	1,67,632	78,423	89,207
టెక్కలి	1,90,272	93,458	96,812
పాతపట్నం	1,63,044	80,485	82,556
శ్రీకాకుళం	1,91,875	94,098	97,776
ఆమదాలవలస	1,57,848	78,515	79,330
ఎచ్చెర్ల	2,03,831	1,02,681	1,01,147
నరసన్నపేట	1,77,145	87,724	89,420

మహిళా ప్రభంజనం

జిల్లాలో మహిళా ఓటర్లు ఓటెత్తారు. పురుషుల కంటే దాదాపు 40వేల మంది స్త్రీలు అధికంగా ఓట్లేశారు. మండుటెండలు ఇబ్బంది పెట్టినా వెనక్కి తగ్గలేదు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో తప్ప మిగతా అన్ని నియోజకవర్గాల్లో మహిళలే ఎక్కువగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. అభ్యర్థుల గెలుపోటములపై మహిళల ఓట్లు తప్పనిసరిగా ప్రభావం చూపనున్నాయని తెలుస్తోంది.

నియోజకవర్గాల్లో పురుషుల ఓట్లకంటే మహిళల ఓట్ల అధిక్యం ఇలా

ఆమదాలవలస	815
పలాస	10,784
టెక్కలి	3,354
పాతపట్నం	2,071
శ్రీకాకుళం	3,678
నరసన్నపేట	1,696
ఇచ్ఛాపురం	17,972

1 చోట తగ్గింది.. 7 చోట్ల పెరిగింది..

- జిల్లాలో 2019 కంటే ఓటింగ్ శాతం కొంతమేర పెరిగింది. ఎచ్చెర్ల మినహా అన్ని నియోజకవర్గాల్లో ఈ సారి ఓటింగ్ శాతం పెరిగింది.
- శ్రీకాకుళం నియోజకవర్గంలో గత ఎన్నికల్లో 70.01శాతం ఓటింగ్ జరగ్గా ఈసారి 70.21 శాతం ఓటింగ్ జరిగింది.
- ఇచ్ఛాపురం నియోజకవర్గంలో గత ఎన్నికల్లో 70.15శాతం ఓటింగ్ జరగ్గా ఈసారి 70.56 శాతం పోలింగ్ అయింది. 0.38శాతం ఓటింగ్ పెరిగింది.
- ఎచ్చెర్ల నియోజకవర్గంలో గత ఎన్నికల్లో 84.30 శాతం ఓటింగ్ జరగ్గా ఈ సారి 83.28 శాతం పోలింగ్ జరిగింది. దాదాపు 1.16 శాతం గతం కంటే తగ్గింది.
- పలాస నియోజకవర్గంలో గత ఎన్నికల్లో 72.92శాతం ఓటింగ్ జరగ్గా ఈసారి 76.42శాతం ఓటింగ్ నమోదైంది. 2.22శాతం ఓటింగ్ పెరిగింది.
- టెక్కలి నియోజకవర్గంలో గత ఎన్నికల్లో 78.78 శాతం ఓటింగ్ జరగ్గా ఈ సారి 80.51శాతం ఓటింగ్ జరిగింది.
- నరసన్నపేట నియోజకవర్గంలో గత ఎన్నికల్లో 80.00 శాతం ఓటింగ్ జరగ్గా ఈ సారి 82.44శాతం ఓటింగ్ నమోదైంది.
- ఆమదాలవలస నియోజకవర్గంలో గత ఎన్నికల్లో 78.51 శాతం ఓటింగ్ జరగ్గా ఈ సారి 81.42శాతం ఓటింగ్ జరిగింది.
- పాతపట్నం నియోజకవర్గంలో గత ఎన్నికల్లో 69.47 శాతం ఓటింగ్ జరగ్గా ఈ సారి 72.36శాతం నమోదైంది.

● ఓటు విడుపు..

ఎన్నికల సమయం ముగిసింది. ఇన్నాళ్లూ ప్రచారాలు, సమీక్షలు, ర్యాలీలు అంటూ బిజీబిజీగా గడిపిన నాయకులు రిలాక్స్ మోడ్‌లోకి వెళ్లారు. కొందరు స్వగ్రామాల్లో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకోగా.. మరికొందరు కార్యకర్తలు, అనుచరులతో పోలింగ్ సరళిపై సమీక్షించారు.



కాశీబుగ్గలో కుటుంబంతో కలిసి సరదాగా గడుపుతున్న మంత్రి సీదిరి అప్పలరాజు



శ్రీకాకుళం రూరల్: మనవడితో ఆడుకుంటున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు



టెక్కలి: తన కార్యాలయంలో కార్యకర్తలతో సరదాగా మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్



టెక్కలి: నందిగాం మండలం కణితూరులో ఇంటి వద్ద కార్యకర్తలతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్



ఆమదాలవలసలో ఇంటి వద్ద ఆనందంగా కార్యకర్తలతో మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం, సతీమణి వాణి, కుమారుడు చిరంజీవినాగ్



రణస్థలం: పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



ఎల్.ఎన్.పేట: ముఖ్య నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



మబగాంలో వైఎస్సార్ సీపీ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

భద్రపర్చిన ఈవీఎంలు పరిశీలిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్



స్ట్రాంగ్ రూముల్లో ఈవీఎంలు భద్రం

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాలు, పార్లమెంట్ సెగ్మెంట్ వారీగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు చిలకపాలెంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ కేంద్రాలకు సోమవారం రాత్రి చేరాయి. అన్ని నియోజకవర్గాల నుంచి సామగ్రి ఇక్కడకు చేరే సరికి అర్ధరాత్రి దాటింది. అనంతరం ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. అధికారులు, రాజకీయ పార్టీల ఏజెంట్‌ల సమక్షంలో మంగళవారం సీళ్లు వేశారు. స్ట్రాంగ్ రూమ్‌లకు మూడంచల భద్రత ఏర్పాటుచేశారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు సమయంలో రాజకీయ పార్టీల ఏజెంట్ల సమక్షంలో సీళ్లు తొలగించి కౌంటింగ్ కేంద్రాలకు ఈవీఎంలు తరలిస్తారు.

స్ట్రాంగ్ రూమ్‌లకు ఈవీఎంల తరలింపు, భద్రపర్చటం, సీట్లు వేయటం వంటి ప్రక్రియలను ఎన్నికల పరిశీలకులు శేఖర్ విద్యార్థి, కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్, నియోజకవర్గ ఆర్వోలు పర్యవేక్షించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద ఇండో టిబెటన్ బోర్డర్ పోలీసులు 24 గంటల భద్రత పహారా ఏర్పాటు చేశారు. స్ట్రాంగ్ రూమ్‌ల వెలుపల వైపు ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులు భద్రత ఏర్పాటు చేశారు. కళాశాల చుట్టు పక్కల సైతం షిఫ్టుల్లో పోలీ స్ భద్రత కొనసాగనుంది. నిరంతరం రాజకీయ పార్టీ అభ్యర్థులు, ఏజెంట్లు పరిశీలించుకునే అవకాశం కల్పించారు. సీసీ కెమెరాలు నిఘా, రికార్డింగ్ వ్యవస్థ, నిరంతరం విద్యుత్ సౌకర్యం వంటివి ఏర్పాటు చేశారు. పోలింగ్ ముగిసిన తర్వాత జోన్లు వారీగా జీపీఎస్ అనుసంధానం చేసిన ట్రాక్‌లు ఏర్పాటు చేసిన వాహనాల్లో ఈవీఎంలు రిసెప్షన్ కేంద్రాలకు తీసుకువచ్చారు. కౌంటింగ్ పూర్తయ్యే వరకు స్ట్రాంగ్ రూమ్‌ల్లో భద్రత, ఇతర అంశాలను తమ దృష్టికి తెచ్చి తెలుసుకోవచ్చునని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎన్నికలు పరిశీలకులు సందీప్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ తమీమ్ అన్సారియా , ఆర్‌ఓ నూరుల్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు పాల్గొన్నారు.



స్ట్రాంగ్ రూమ్ భద్రతలో కేంద్ర దళాల సిబ్బంది



స్ట్రాంగ్ రూమ్‌ల బయట భద్రత పరిశీలిస్తున్న ఎన్నికల అధికారులు

బాస్కెట్‌బాల్ జట్ల ఎంపికలకు సై

- నేడు జిల్లా అండర్–16 బాలబాలికల ఎంపిక పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా బాస్కెట్‌బాల్ జట్ల ఎంపికలకు రంగం సిద్ధమైంది. జిల్లాస్థాయి అండర్–16 బాలబాలికల బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీలు బుధవారం జరగనున్నాయి. ఇందుకు జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి నేతృత్వంలో సంఘ ప్రతినిధులు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. నేడు ఉదయం 9 గంటల నుంచి శ్రీకాకుళం నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ క్రీడా మైదానం వేదికగా ఎంపిక పోటీలు జరగనున్నాయి.

ఇక్కడ ఎంపికైతే రాష్ట్ర పోటీలకు..

ఇక్కడ ఎంపికల్లో రాణించిన క్రీడాకారులను జిల్లా బాస్కెట్‌బాల్ జట్లకు ఎంపిక చేయనున్నారు. ఎంపిక చేసిన జిల్లా జట్లను త్వరలో జరిగే ఏపీ రాష్ట్రస్థాయి అండర్–16 బాలబాలికల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్–2024 పోటీలకు పంపించనున్నారు. ఆసక్తి, అర్హత కలిగిన బాస్కెట్‌బాల్ క్రీడాకారులు తమ జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, నాలుగు ఫొటోలతో ఎంపికలకు హాజరుకావాలని ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. క్రీడా మైదానం వద్ద డీఎస్‌ఏ కోచ్ జి.అర్జున్‌రావురెడ్డి (సెల్: 99492 91288)ని సంప్రదించాలని ఆయన కోరారు.

క్లుప్తంగా

ఆదుకున్న స్నేహితులు



ఈశ్వరరావు కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న స్నేహితులు

జలుమూరు: మండల పరిధి కరకవలసకు చెందిన కరికోల ఈశ్వరరావు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. ఆయనతో పాటు స్థానిక జెడ్పీ హైస్కూల్లో చదువుకున్న వారంతా మృతుని కుటుంబాన్ని ఆదుకున్నారు. ఈ మేరకు అతని భార్య లక్ష్మిని పరామర్శించి రూ.50 వేలు ఆర్థిక సాయం అందించారు. స్నేహితుల ఉదారతపై పలువురు అభినందించారు.

బైక్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

టెక్కలి రూరల్: స్థానిక ఒలేసాగరం సమీపంలో ద్విచక్రవాహనం ఢీకొని పల్లి శ్రీనివాస్ అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ మేరకు స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. టెక్కలికి చెందిన శ్రీనివాస్ అతని స్నేహితుడు వెంకటేష్‌తో కలసి ఒలేసాగరం గ్రామ సమీపంలో రోడ్డు పక్కగా మాట్లాడుతూ ఉండగా టెక్కలి నుంచి సీతాపురం వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్న యువకుడు ఒక్కసారిగా ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో వెంకటేష్‌కు స్వల్పగాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులు మంగళవారం వివరాలు సేకరించారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



విరాళాన్ని అందజేస్తున్న దృశ్యం

గార: శ్రీకూర్మనాథాలయంలో నిత్యం జరిగే అన్నదాన పథకానికి శ్రీకూర్మం గ్రామానికి చెందిన చేబోలు రాజేశ్వరరావు రూ.లక్షా నూట పదహార్లు విరాళం అందజేశారు. మంగళవారం ఈ మేరకు ఈఓ జి.గురునాథంను కలిసి చెక్ అందించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు, నర్సుబాబు తదితరులు పాల్గొన్నారు.

విజయోత్సవ సభకు సిద్ధం కండి



పలాస క్యాంప్ కార్యాలయంలో మాట్లాడుతున్న డాక్టర్ సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: విజయోత్సవ సభకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు సిద్ధం కావాలని రాష్ట్ర పశుసంవర్థక పాడి పరిశ్రమల మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పలాస నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, బూత్‌లెవెల్ ఏజెంట్లు, అందరితో వీడియో కాన్ఫరెన్స్‌లో మంగళవారం మాట్లాడారు. మీ అందరి ఆశీస్సులతో మరోసారి అఖండ మెజారిటీ వస్తుందని, పలాస నియోజకవర్గం మనదేనని అన్నారు. గతం కంటే ఎక్కువ సీట్లతో మరోసారి ముఖ్యమంత్రి స్థానంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కూర్చోబోతున్నారని తెలిపారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. మరో ఇరవై రోజులు మనందరం ఓపిక పట్టాలని, జూన్ 4వ తేదీన విజయోత్సవ సంబరాలు చేసుకోబోతున్నామని అన్నారు.

'వైఎస్సార్‌సీపీ ఓటర్లందరికీ కృతజ్ఞతలు'



వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనకు మరోసారి ప్రజలంతా పట్టం కట్టేందుకు సిద్ధమై ఓటేశారని వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ అన్నారు. వైఎస్సార్‌సీపీ పార్టీ తరఫున ఎంపీగా పోటీచేసిన తనకు ఓట్లు వేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పేద ప్రజల అభివృద్ధి ఆగిపోకుండా ఉండాలంటే వైఎస్సార్‌సీపీకే ఓటేయాలన్న దృఢ సంకల్పంతో సుదూర ప్రాంతాల నుంచి భారీగా ప్రజలు వచ్చారన్నారు. జిల్లాలో పురుషుల కంటే మహిళ ఓటర్లే ఎక్కువగా ఉన్నాయని పోలింగ్‌కు హాజరై ఓటేసింది కూడా మహిళలేనని అన్నారు. ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, ప్రజలంతా ఓటేయ్యడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తనకు సహకరించిన మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, స్పీకర్ తమ్మినేని సీతారాం, జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్యే రెడ్డి శాంతి, ఎమ్మెల్సీలు దువ్వాడ శ్రీనివాస్, నర్తు రామారావు, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ, సాయిరాజ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

'ప్రతిభ'కు ప్రభుత్వ ప్రోత్సాహం

- ప్రభుత్వ బడుల్లో చదివి టాపర్లుగా నిలిచిన టెన్త్, ఇంటర్మీడియెట్ టాపర్లకు ప్రభుత్వం నజరానా
- పాఠశాల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో సన్మానం
- ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాట్లు చేస్తున్న విద్యాశాఖ అధికారులు



టెన్త్‌క్లాస్ విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రభుత్వ బడుల్లో చదివి పదో తరగతి పరీక్షల్లోను, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివి ఇంటర్మీడియెట్ పరీక్షల్లోను అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు (స్టేట్ బ్రిలియన్స్ అవార్డ్స్) పేరిట సన్మానాలతోపాటు నగదు ప్రోత్సాహకాలు వరుసగా రెండో ఏడాది కూడా అందజేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు అధికారులు వివరాలు సేకరణ పనిలో నిమగ్నమయ్యారు. ప్రభుత్వం అందజేస్తున్న జగనన్న ఆణిముత్యాల సన్మానాలు, నగదు పారితోషికం పాఠశాల స్థాయి, నియోజకవర్గ స్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయి నాలుగు దశలుగా సన్మానాలు చేయనున్నారు. నియోజకవర్గ స్థాయిలతో పాటు ఆయా పాఠశాలల యాజమాన్యాల వారీగా టాపర్లకు బహుమతులు అందించనున్నారు.

మొదటి మూడు స్థానాలకు..

జిల్లా విద్యాశాల అధికారులు మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారి జాబితాలను సిద్ధం చేస్తున్నారు. వారికి బహుమతి, మెరిట్ సర్టిఫికెట్, జ్ఞాపికను అందించనున్నారు. అలాగే ప్రతిభ కనబర్చిన విద్యార్థుల తల్లిదండ్రులను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులను కూడా సత్కరిస్తారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులను మరింత ప్రోత్సాహించే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఈ కార్యక్రమానికి గత ఏడాదే శ్రీకారం చుట్టారు. ఈ తరహా విధానాలు.. విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని, పోటీతత్వాన్ని తీసుకొస్తాయని భావించి ఈ నిర్ణయం తీసుకున్నారు. సీఎం నిర్ణయంపై ఉపాధ్యాయ వర్గాలు, తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. గతంలో లాగానే ఈ ఏడాది కూడా అవే మొత్తాలను నజరానాగా అందజేసే యోచనలో ప్రభుత్వం ఉందని అధికారులు చెబుతున్నారు.

ఏపీఆర్‌జేసీలో సత్తాచాటిన విద్యార్థులు



సూరపు శ్రావణి



బుడితి యమున



రగుతు భవ్యశ్రీ



మహేష్



ప్రఘ్నప్రియ

కోటబొమ్మాళి: ఏపీఆర్‌జేసీ పరీక్ష ఫలితాల్లో కోటబొమ్మాళి మండలం ఊడికిలపాడు గ్రామానికి చెందిన సనపల ప్రఘ్నప్రియ 32వ ర్యాంకు సాధించింది. ప్రఘ్నప్రియ పదో తరగతి వరకూ కోటబొమ్మాళిలోని ఓ ప్రైవేటు హైస్కూల్‌లో చదివింది. తండ్రి రమేష్ ఆన్‌లైన్ కేంద్రం నడుపుతున్నాడు. తల్లి గృహిణి. ప్రఘ్నప్రియను స్థానిక ఎంఈఓ 1, 2లు ఎస్.అప్పలరాజు, ఎల్‌వీప్రతాప్ అభినందించారు.

సారవకోట విద్యార్థులు

సారవకోట: ఏపీఆర్‌జేసీ పరీక్ష ఫలితాలలో మండలంలోని పలువురు విద్యార్థినులు సత్తా చాటారు. సారవకోట నవతేజ పాఠశాలకు చెందిన ముగ్గురు బాలికలు ఉత్తమ ర్యాంకులు సాధించారు. వీరిలో బుడితి యమునకు బైపీసీలో 192వ ర్యాంకు, సూరపు శ్రావణికి ఎంపీసీలో 271వ ర్యాంకు, రగుతు భవ్యశ్రీకి ఎంపీసీలో 521వ ర్యాంకులు వచ్చాయి.

48వ ర్యాంకు

నరుబుజ్జిలి: ఏపీఆర్డీసీ ఫలితాల్లో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఇంటర్మీడియెట్ విద్యార్థి కూరాకుల మహేష్ రాష్ట్రస్థాయిలో 48వ ర్యాంకు సాధించాడు. విద్యార్థి తల్లిదండ్రులు కూలి పనులు చేసుకొని తన కుమారుడిని చదివించారు. విద్యార్థికి ర్యాంకు దక్కడంపై ప్రిన్సిపాల్ రాబిల్లి భూషణరావు, అధ్యాపకులు అభినందన తెలిపారు.

మెంటాడలో కొట్లాట



మెంటాడలోని సంఘటన స్థలంలో పోలీసులు

రణస్థలం: మెంటాడ గ్రామంలో రెండు గ్రామాల యువకుల మధ్య మద్యం మత్తులో జరిగిన గొడవ తీవ్ర ఉద్రికత్తలకు దారి తీసింది. జేఆర్ పురం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలో మెంటాడ గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం 1గంట సమయంలో విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలంలోని చింతపల్లి, మండలంలోని మెంటాడ గ్రామాలకు చెందిన యువకుల మధ్య స్వల్ప వివాదం చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో ఇరువర్గాల కొట్లాటలో గాయపడిన చింతపల్లి యువకులు గ్రామంలోనికి వెళ్లి మెంటాడ గ్రామస్తులు కొట్టారని చెప్పడంతో ఆ గ్రామానికి చెందిన సుమారు 100 మంది మెంటాడ గ్రామానికి వచ్చారు. రెండు వర్గాల మధ్య కొట్లాట జరిగింది. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న జేఆర్ పురం సీఐ జి.రామచంద్రరావు సంఘటన స్థలానికి వెళ్లి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. ఈ కొట్లాటలో మెంటాడకు చెందిన సాడి రమణ, పెంటయ్య, నూకలమ్మ గాయాలు కావడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కె.గోవిందరావు తెలిపారు.

ఫుడ్ ఆర్డర్ తీసుకోలేదని దాడి



గాయాలతో బాధితుడు రవి

శ్రీకాకుళం క్రైమ్ : తమ ఫుడ్ ఆర్డర్ తీసుకోలేదంటూ సోమవారం అర్ధరాత్రి జిల్లా కేంద్రంలోని ఓ ఆహార విక్రయ సంస్థ యాజమాన్యంపై దాడి చేయడమే కాకుండా వస్తుసామగ్రిని ధ్వంసం చేసిన ఘటన నగరంలో చోటు చేసుకుంది. రెండో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రామలక్ష్మణ కూడలి సమీపంలో ఉన్న ఓ ఫుడ్‌కోర్టుకు గొంటివీధికి చెందిన కాళిదాసు అనే వ్యక్తి సోమవారం రాత్రి పదిన్నర గంటల సమయంలో వెళ్లి ఫుడ్ ఆర్డర్ చేశాడు. ఈ సమయంలో ఫుడ్ ఇవ్వడం కుదరదని మేనేజర్ అదపాక రవి చెప్పడంతో అతనితో వాగ్వాదానికి దిగాడు. వెంటనే కాళిదాసు తన మిత్రులకు ఫోన్ చేయడంతో కొర్లపాటి శేఖర్, వెంకట్, మరో ముగ్గురు కలిసి అక్కడకు వచ్చారు. ఫుడ్ ఇస్తారా లేదా అంటూ మేనేజర్ రవిని బెదిరించడంతో అతని సుపీరియర్ ఆసిన్‌కు సమాచారమందించాడు. అసిన్ కాళిదాసు, అతని మిత్రులు ఐదుగురిని సర్దిచెప్పే ప్రయత్నం చేసినా వినకుండా దాడికి పాల్పడ్డారు. మేనేజర్ రవికి వెంకట్ ముక్కుపై పిడిగుద్దులు గుద్దడంతో రక్తస్రావం అవ్వగా, ఆసిన్‌కు మిగతా ఐదుగురు చేతులతో కొట్టడంతో ముఖంపై, కనుబొమ్మపై గాయాలయ్యాయి. అక్కడితో ఆగకుండా రూ 3.40 లక్షల విలువ కలిగిన కంప్యూటర్లు, ప్రింటర్లు, పేటీఎం బాక్సులు అంతా కలిసి ధ్వంసం చేశారు. దీనిపై మంగళవారం రాత్రి మేనేజర్ రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఉమా చెప్పారు.

'ఎన్నికలు విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు'



అంధవరపు సూరిబాబు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లాలో ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా, సజావుగా నిర్వహించేందుకు సహకరించిన జిల్లా అధికార యంత్రాంగం, పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు, ప్రజలకు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు, కళింగ వైశ్య, భేరి వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాజ్యాంగ స్ఫూర్తిని ఇనుమడింపజేసేలా ఎన్నికలు నిర్వహించి ప్రజలు స్వేచ్ఛగా, శాంతియతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవడంలో కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు చెప్పారు. క్యూలలో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు మజ్జిగ, ఇతర ఆహార పదార్థాలు అందించి సహకరించిన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు, అత్యధికంగా మహిళలు ఓటు హక్కు వినియోగించుకునేలా సహకరించిన అందరి కృషి అభినందనీయమన్నారు. రాష్ట్రాన్ని సంక్షేమ పథంలో నడిపించిన వైఎస్ జగన్‌కు తెలుగు ఆడపడుచులు బ్రహ్మరథం పట్టారని తెలిపారు. సీఎం వైఎస్ జగన్ వంగా గీతను డిప్యూటీ సీఎం చేస్తానని చెప్పారని, పవన్ కల్యాణ్‌ను పూర్తిగా వాడుకున్న నారా చంద్రబాబు నాయుడు పవన్ కల్యాణ్‌ను డిప్యూటీ సీఎంను చేస్తానని ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. చంద్రబాబు మేనిఫెస్టోను ప్రజలు నమ్మలేదని కాబట్టే మహిళలు అధిక సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొని జగన్‌కు మద్దతు తెలిపారన్నారు.

పాముకాటుతో యువకుడు మృతి



శివానంద్(ఫైల్)

నందిగాం: చేతికి అందివచ్చిన కుమారుడు పాము కాటుకు బలైపోయాడు. మండలంలోని పెద్దలవునిపల్లి గ్రామానికి చెందిన లిఖినాన శివానంద్(21)అనే యువకుడు మృతి చెందాడు. ఈ మేరకు స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. మృతుడు శివానంద్ తన ఇంట్లో పడుకుని ఉండగా ఏదో కరిచినట్లు అయ్యింది. కానీ దాన్ని పట్టించుకోకుండా నిద్రపోయాడు. ఉదయం లేచే సరికి సుస్తీగా ఉండడంతో టెక్కలి జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ వైద్యం పొందుతూ మృతి చెందాడు. మృతుడికి తల్లి పార్వతి, అన్నయ్య ఉన్నారు. మృతుడు డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాడు. పాముకాటుతో యువకుడు మృతిచెందిన విషయం తెలియడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఆహా.. తాటి ముంజెలు



తాటి ముంజెల్ని కొడుతున్న యువకులు



తాటి ముంజెలు

ఇచ్ఛాపురం రూరల్: మండు వేసవిలో తాటి ముంజెలు నోరూరిస్తున్నాయి. వేసవిలో మాత్రమే దొరికే ఈ ప్రకృతి ప్రసాదం ఆరోగ్యానికి ఎంతో మంచిది. అప్పుడే చెట్టుమీద నుంచి దింపే ముంజకాయలు స్వచ్ఛమైనవి, కల్తీ లేనివి, ఆరోగ్యమైనవి. ఈ పండు శరీరానికి కలిగించే చలువ వల్ల దీన్ని 'ఐస్ యాపిల్' అని కూడా అంటారు. ఉద్దానం ప్రాంతంలోని కొబ్బరి తోటల గట్లుపై, పంట పొలాల గట్లుపై ఈ చెట్లు విరివిగా పెరుగుతాయి. లేత తాటి కాయల నుంచి అమ్మకందారులు నేర్పుగా ముంజలను వేరు చేసి వెదురు బుంగల్లో, తాటి కమ్మల్లో వేసి డజను యాభై రూపాయలు చొప్పున్న విక్రయిస్తున్నారు.

ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలు



లొడగల భీమారావుకు వైద్యం అందిస్తున్న సిబ్బంది



కాలు విరిగిన కొర్రాయి అశోక్

కాశీబుగ్గ: ఆగి ఉన్న ద్విచక్రవాహనాన్ని అత్యధిక వేగంతో ఢీకొట్టడంతో ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. వజ్రపుకొత్తూరు మండలం అనంతగిరి పంచాయతీ వెంకటాపురం జాతీయ రహదారిపై ప్రమాదం జరిగింది. సంతబొమ్మాళి మండలం గొదలాం గ్రామానికి చెందిన కొర్రాయి అశోక్, డొక్కరి కామరాజులు బైక్‌పై ఉండగా వెంకటాపురం జాతీయ రహదారిపై లొడగల భీమారావు, జనపాన వసంతరావు వారికి ఎదురుగా వచ్చి ఢీకొన్నారు. దీంతో అంతా రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయారు. ప్రమాదంలో కొర్రాయి అశోక్‌కు కుడికాలు విరిగిపోగా, లొడగల భీమారావుకు, డొక్కరి కామరాజుకు తలలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి ప్రమాద స్థలం నుంచి హుటాహుటిన వారిని ప్రభుత్వ అంబులెన్సులో పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. అత్యవసర వైద్యం అందించిన ఆస్పత్రి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యానికి టెక్కలి జిల్లా ఆస్పత్రికి ఇద్దరిని, శ్రీకాకుళం రిమ్స్‌కు ఇద్దరిని వేర్వేరు అంబులెన్స్‌లో తరలించారు. వజ్రపుకొత్తూరు పోలీసులు విచారణ చేపడుతున్నారు.

వేసవి సెలవులకు వచ్చి..

- పారాపురం రిజర్వాయర్‌లో మునిగి బాలుడు మృతి
- వేసవి సెలవులకు వచ్చి మృతి చెందిన వైనం



శ్రీరాంవలస హవీష్ మృతదేహం (ఇన్‌సెట్లో) శ్రీరాంవలస హవీష్

కొత్తూరు: కొత్తూరు మండలం పారాపురం రిజర్వాయర్‌లో ప్రమాదవశాత్తు జారిపడి ఓ విద్యార్థి మృతి చెందాడు. బూర్జ మండలం బూర్జ గ్రామానికి చెందిన శ్రీరాంవలస విజయ, శ్రీహరిలకు ముగ్గురు పిల్లలు. విజయ కన్నవారిల్లు కొత్తూరు. వేసవి సెలవుల కోసం వారం రోజుల కిందట వీరు వచ్చారు. మంగళవారం సాయంత్రం హవీష్(14) తోటి పిల్లలతో కలిసి రిజర్వాయర్‌లో స్నానం చేద్దామని వెళ్లాడు. రిజర్వాయర్‌లోకి దిగుతుండగా ప్రమాదవశాత్తు జారిపడి నీటిలో మునిగిపోయాడు. హవీష్ మునిగిపోవడంతో తోటి పిల్లలు సమీపంలో క్రికెట్ ఆడుతున్న యువకులకు చెప్పారు. వెంటనే వారు రిజర్వాయర్‌లోకి దిగి అడుగున ఉన్న హవీష్‌ను బయటకు తీశారు. వెంటనే అతడిని కొత్తూరు సీహెచ్‌సీకి తీసుకువెళ్లారు. అప్పటికే హవీష్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడు హవీష్ శ్రీకాకుళంలో ఓ ప్రైవేట్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నారు. మృతుడి తల్లి విజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఏంఏ అహ్మద్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పాతపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. బాలుడి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. తల్లిని ఓదార్చడం ఎవరి తరం కాలేదు.

కళింగపట్నం ఘర్షణపై కేసు నమోదు



త్రినాథరావుతో మాట్లాడుతున్న ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు

గార: కళింగపట్నంకు చెందిన సీహెచ్ త్రినాథరావు పోలింగ్ రోజున ఓటు వేసుకొని వెళ్లిపోతుండగా దారిలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ తోపులాట జరిగింది. ఆ సమయంలో పొట్నూరు మిన్నారావు, మరో ఆరుగురు త్రినాథరావుపై దాడి చేయడంతో తలకి బలమైన గాయమైందని ఆయన పోలీసు ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలింగ్ రోజున జరిగిన ఘర్షణపై కేసు నమోదు చేశామని ఎస్ఐ కృష్ణప్రసాద్ తెలిపారు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితుడు త్రినాథరావును వైఎస్సార్ సీపీ యువ నాయకుడు ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

నిత్య స్వరార్చన

- సంగీతంలో రాణిస్తూ.. స్థానిక కళాకారులను ప్రోత్సహిస్తున్న సోమేశ్వరరావు
- భజన పాటలకు సంగీతం కూర్పు
- తన ఆదాయాన్ని కళాకారుల సంక్షేమానికే ఖర్చుచేస్తున్న వైనం
- శివస్వరాభిషేకం ఆల్బమ్ రూపకల్పన



భజనా కార్యక్రమాల్లో కీబోర్డు ప్లే చేస్తున్న సోమేశ్వరరావు



కీబోర్డు ప్లే చేస్తున్న పిలక సోమేశ్వరరావు

కంచిలి: ఆయన నిరుపేద కుటుంబంలో పుట్టారు. అయినా సంగీతంపై ఉన్న ఆసక్తితో స్వరాలు నేర్చుకున్నారు. భజన పాటలకు హార్మోనియం వాయిద్యంతో సంగీతం అందించడం ద్వారా రంగప్రవేశం చేసి, నేడు ఉద్దానం ప్రాంతంలో ఎంతో మంది కళాకారులను తీర్చిదిద్దుతున్నారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా అప్‌డేట్ ఔతూ, తనకున్న ఆర్థిక స్థోమత ద్వారా ఈ ప్రాంతంలో సంగీతం అభివృద్ధి చెందడానికి, కళాకారులను ప్రోత్సహించడం కోసం నిరంతరం అవిశ్రాంతంగా శ్రమిస్తున్నారు. ఆయనే కంచిలి మండలం జాడుపూడి గ్రామానికి చెందిన పిలక సోమేశ్వరరావు. ఈయన నాలుగో తరగతి చదువుతున్నప్పుడే తండ్రి మృతిచెందగా, తల్లి కూడా ఇంటర్మీడియెట్ చదువుతున్న ప్రాయంలో మృతి చెందారు. దీంతో అప్పటి నుంచి కుటుంబ బాధ్యత ఒకవైపు మోస్తూ.. మరోవైపు తనకు సంగీతం మీద ఉన్న ఆసక్తిని చంపుకోకుండా అంతటి కష్ట పరిస్థితుల్లో కూడా అక్కడ ఇక్కడ పనిచేసుకొంటూ సంగీతం నేర్చుకున్నారు. గ్రామానికి చెందిన శివాలయం అర్చకుడు మోహన్‌రాళో వద్ద శిష్యరికం చేసి హార్మోనియం మొదట నేర్చుకున్నారు. అక్కడి నుంచి భజన పాటలకు మాత్రమే సంగీత కల్పనలో సహకరిస్తుండేవారు. ఇలా మొదలైన సోమేశ్వరరావు ప్రస్థానం.. తర్వాత కాలంలో కళామతల్లి ఆశీస్సులతో దినదిన ప్రవర్ధమానమైంది. తనకు వచ్చిన విద్యను పలువురిని నేర్పించడం మొదలుపెట్టారు. ఇచ్ఛాపురం నుంచి వజ్రపుకొత్తూరు వరకు గల 7 మండలాల పరిధిలో ఉన్న సంగీత కళాకారులందరికీ ఒకే తాటిపైన నడిపించే విధంగా ఒకచోటకు చేర్చడంతో, ఈయనను తమ యూనియన్ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. భజన కార్యక్రమాలకు వెళ్లడం ద్వారా మిగతా ఆ బృందానికి ఇచ్చే పారితోషికంలో తన వాటాగా వచ్చే మొత్తాన్ని తన సొంతానికి ఖర్చుపెట్టకుండా ఒక నిధిని ఏర్పాటు చేస్తున్నారు. ఆ సొమ్ముతో పేద కళాకారులెవరికైనా ఆర్థిక అవసరాలు ఏర్పడినా, కళాకారులను అప్పుడప్పుడు సమావేశపరిచి, ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడం వంటివి చేపడుతున్నారు.

పుణ్యక్షేత్రాల్లో సైతం..

తిరుమల తిరుపతి దేవస్థానంలోను, మహారాష్ట్రలోను, విశాఖపట్నం జిల్లా తదితర ప్రాంతాల్లో తన బృందంతో కలిపి భక్తిపాటలకు సంగీతం అందించారు. ఒకసారి వారణాసిలో కూడా అనుకోకుండా అవకాశం రావడంతో కీబోర్డు ప్లే చేసినట్లు తెలిపారు.

శివుని పాటలతో ఆల్బమ్ రూపకల్పన..

తనకు ఇష్టదైవమైన శివుని ఆరాధించే 16 పాటలను రాసి, సంగీతం అందించి, కీబోర్డు ప్లే చేస్తూ రూపొందించారు. ఈ సీడీలను విడుదల చేశారు. ఈ పాటలు ఉద్దానం ప్రాంతంలో వివిధ ప్రాంతాల్లో వింటున్నారు. సంగీతంలో తనకున్న అనుభవంతో సమాజానికి సందేశాన్నిచ్చే వివిధ అంశాలను ఎంపిక చేసుకొని, స్థానిక కళాకారులను భాగస్వామ్యం చేస్తూ 38 వీడియో పాటలను చిత్రీకరించారు. వీటిని సోమేష్ చంద్ర స్కిల్స్ పేరుతో యూట్యూబ్ చానల్ ఓపెన్ చేసి, అప్‌లోడ్ చేశారు. కళామ్మతల్లిపై పెట్టుకున్న మక్కువ, భక్తిభావమే తనకు చిన్నప్పటి నుంచి అన్నింటినీ సమకూరుస్తోందని నమ్ముతున్నానని సోమేశ్వరరావు సాక్షితో చెప్పారు.